క్లుప్తంగా

దత్తాత్రేయస్వామికి విశేష పూజలు



దత్తాత్రేయస్వామికి పూజలు చేస్తున్న అర్చకులు

శ్రీశైలంటెంపుల్: లోకకల్యాణం కోసం శ్రీశైల దేవస్థానం గురువారం సందర్భంగా ఆలయ ప్రాంగణంలోని త్రిఫల వృక్షం కింద వెలసిన శ్రీదత్తాత్రేయస్వామికి విశేషపూజలను దేవస్థానం అధికారులు, అర్చకులు నిర్వహించారు. పూజా కార్యక్రమాలు నిర్విఘ్నంగా జరిగేందుకు ముందుగా మహాగణపతి పూజ జరిపించారు. అనంతరం దత్తాత్రేయస్వామికి అభిషేకాది, అర్చనలు చేసి ప్రసాద వితరణ గావించారు.

అక్రమ వెంచర్లపై చట్ట పరమైన చర్యలు



అక్రమ వెంచర్లను పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ సుధాకర్‌రెడ్డి

నందికొట్కూరు: అక్రమ వెంచర్లపై చట్ట పరమైన చర్యలు తప్పవని మున్సిపల్ కమిషనర్ సుధాకర్‌రెడ్డి హెచ్చరించారు. గురువారం పట్టణంలో వెలసిన అక్రమ వెంచర్లను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ 100 అక్రమ వెంచర్లల్లో సుమారు 500 ఎకరాలలో ప్లాట్లు వేసి ప్రభుత్వ అనుమతులు లేకుండా దళారులు సామాన్య ప్రజలకు విక్రయించి కోట్ల రూపాయలు దండుకుని మున్సిపాలిటీకి గండి కొడుతున్నారన్నారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ప్లాట్లు అమ్మకాలు చేస్తున్న రియల్ ఎస్టేట్ వ్యాపారస్తులకు నోటీసులిచ్చామన్నారు. మున్సిపాలిటీ అధికారుల అనుమతి లేకుండా రిజిస్ట్రేషన్లు చేయొద్దని రిజిస్ట్రార్‌కు సూచించినట్లు పేర్కొన్నారు.

వ్యక్తి ఆత్మహత్యాయత్నం

పగిడ్యాల: కుటుంబ కలహాలతో విరక్తి చెందిన ఓ వ్యక్తి పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన నెహ్రూనగర్ గ్రామంలో గురువారం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన గొల్ల రమేష్ ఉదయం భార్యతో గొడవపడ్డాడు. క్షణికావేశానికి గురైన అతను ఇంటి నుంచి బయలుదేరి కొణిదేలకు వెళ్లి పురుగు మందు తీసుకుని గ్రామ శివారులోని తప్పెట మాన్యం పొలంలో లిక్కర్‌లో కలుపుకుని తాగాడు. అనంతరం ఇంటికి ఫోన్ చేసి సమాచారమిచ్చాడు. దీంతో అప్రమత్తమైన బంధువులు హుటాహుటినా ఘటన స్థలానికి చేరుకుని ప్రత్యేక వాహనంలో కర్నూలు ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉన్నట్లు బంధువులు తెలిపారు. ముచ్చుమర్రి ఎస్ఐ జయశేఖర్‌ను అడుగగా విషయం తమ దృష్టికి వచ్చిందని తెలిపారు.

భారతీయ సంస్కృతిని సంరక్షించుకోవాలి



ఉపన్యసిస్తున్న తిరుమల తిరుపతి హిందూ ధర్మప్రచారకులు

మిడుతూరు: భారతీయ సంస్కృతిని సంరక్షించుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని జయదేవానంద స్వామి అన్నారు. గురువారం స్థానిక శ్రీ లక్ష్మీచెన్నకేశవస్వామి ఆలయంలో తిరుమల తిరుపతి దేవస్థాన హిందూధర్మ ప్రచార పరిషత్ ఉమ్మడి జిల్లా కార్యనిర్వాహకులు మల్లు వెంకటరెడ్డి ఆధ్వర్యంలో ధార్మిక ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక భావాలను అలవర్చుకోవాలని సూచించారు. సనాతన ధర్మంను పాటించాలన్నారు. అదేవిధంగా ఆయలంలో రెండవరోజు భజన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ శివరామకృష్ణారెడ్డి, ధర్మప్రచారకులు రామ్మోహన్, నాగిరెడ్డి, చిట్టిబాబు, కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రైతు సంఘంలో చేరాలి

ఆత్మకూరు: రాజకీయాలతో సంబంధం లేకుండా రైతులు తమ సమస్యల పరిష్కారం కోసం సంఘటితమై సంఘాన్ని ఏర్పాటు చేసుకోవాలని, ప్రతి రైతు సంఘంలో సభ్యుడిగా చేరాలని ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.రాజశేఖర్ పిలుపునిచ్చారు. గురువారం రైతుసంఘం సభ్యత్వాన్ని ఆత్మకూరు మండలంలోని వడ్ల రామాపురం, కరివేన గ్రామాల్లో ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. రైతులు తీవ్రమైన సంక్షోభంలో ఉన్నారని, పంటలు లేక పండిన పంటకు గిట్టుబాటు ధర లేక పెట్టుబడి ఖర్చులు పెరిగిపోయి రైతుల ఆత్మహత్యలు పెరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఏపీ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు సుబ్బరాయుడు, సహాయ కార్యదర్శి టి.వెంకటేశ్వరరావు, జిల్లా నాయకులు గుండిదాసు, ఆత్మకూరు మండల కార్యదర్శి వీరన్న, మండల సహాయ కార్యదర్శి చందా వారి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణ ఓట్లే కీలకం

- ఎన్నికల్లో పోటెత్తిన పల్లె ప్రజలు
- ఆత్మకూరు మండలంలో అత్యధికంగా 94.95 శాతం పోలింగ్
- ఎన్నికల కౌంటింగ్ ప్రారంభానికి 96 గంటలు
- వైఎస్సార్‌సీపీకే విజయావకాశాలు ఎక్కువ
- జోరుగా బెట్టింగ్‌లు



ఓటు వేసేందుకు బారులుదీరిన ఓటర్లు(ఫైల్)

ఆత్మకూరు: శ్రీశైలం నియోజకవర్గంలో ఈనెల 13న జరిగిన అసెంబ్లీ, పార్లమెంట్ సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి ఓట్ల లెక్కింపునకు కౌంట్ డౌన్ ప్రారంభమయ్యింది. మరో 96 గంటల్లో ఓట్ల లెక్కింపు ప్రారంభం కానుండడంతో నియోజకవర్గమంతటా ఎన్నడూలేని విధంగా ఉత్కంఠ నెలకొంది. కాగా పట్టణాల్లో కంటే గ్రామీణ ప్రాంతాల్లోనే అత్యధికంగా పోలింగ్ నమోదు కావడంతో గెలుపోటముల్లో వీరి ఓట్లే కీలకం కానున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో 90 శాతంపైగానే ప్రజలు ఓటు హక్కును వినియోగించుకోవడంతో తీర్పు వైఎస్సార్‌సీపీకే అనుకూలంగా వస్తుందని ఆ పార్టీ నాయకులు ధీమా వ్యక్తం చేస్తున్నారు. దీంతో గతంలో ఎన్నడూలేనివిధంగా బెట్టింగ్‌ల జోరు కొనసాగుతుంది.

అత్యధికం శ్రీపతిరావుపేట..
అత్యల్పం శ్రీశైలం –2 పోలింగ్ కేంద్రం

నియోజకవర్గంలో మొత్తం 1,96,116 మంది ఓటర్లు తమ ఓటుహక్కును వినియోగించుకోవాల్సి ఉండగా 1,62,760 మంది ఓటు వేయడంతో 82.99 శాతం పోలింగ్ నమోదయ్యింది. పలు గ్రామాల్లో సునామీల పోలింగ్‌లో గ్రామీణ ప్రాంతాల ఓటర్లు పాల్గొన్నారు. ఆత్మకూరు, వెలుగోడు ప్రధాన పట్టణాలతో పోలిస్తే గ్రామీణ ప్రాంతాల్లోనే అత్యధికంగా పోలింగ్ జరిగింది. పోలింగ్ తీరును పరిశీలిస్తే.. శ్రీశైలం నియోజకవర్గంలోని ఆత్మకూరు మండలం శ్రీపతిరావుపేట గ్రామానికి చెందిన పోలింగ్ కేంద్రం–44లో అత్యధికంగా 94.95 శాతం పోలింగ్ నమోదయ్యింది. ఈ పోలింగ్ కేంద్రంలో మొత్తం 654 మంది ఓటర్లకు గానూ 299 మంది పురుషులు, 322 మంది మహిళలు కలిసి మొత్తం 621 మంది తమ ఓటుహక్కును వినియోగించుకున్నారు. 2వ స్థానంలో నియోజకవర్గంలోని బండిఆత్మకూరు మండలం జి.సి.పాలెంలో 94.41 శాతం ఓటర్లు తమ ఓటుహక్కును వినియోగించుకున్నారు. ఈ గ్రామానికి చెందిన 158 పోలింగ్ కేంద్రంలో మొత్తం 876 మంది ఓటర్లు ఉండగా, అందులో 394 మంది పురుషులు, 433 మంది మహిళలు కలిసి 827 మంది తమ ఓటుహక్కును సద్వినియోగం చేసుకున్నారు. 3వ స్థానాన్ని పరిశీలిస్తే ఆత్మకూరు మండలం కొత్త రామాపురం గ్రామానికి చెందిన 83వ పోలింగ్ కేంద్రంలో మొత్తం 790 మంది ఓటర్లు ఉండగా, 373 మంది పురుషులు, 372 మంది మహిళలు కలిసి మొత్తం 745 మంది తమ ఓటుహక్కును సద్వినియోగం చేసుకోవడంతో ఈ కేంద్రంలో 94.30 శాతం పోలింగ్ నమోదయ్యింది. 4వ స్థానం మహానంది మండలం మసీదుపురం గ్రామానికి చెందిన 209వ పోలింగ్ కేంద్రంలో 94.04 శాతం, 5వ స్థానం ఆత్మకూరు మండలం ఇందిరేశ్వరం గ్రామానికి చెందిన 33వ పోలింగ్ కేంద్రంలో 93.04 శాతం ఓటింగ్ నమోదయ్యింది. నియోజకవర్గంలో శ్రీశైలం మండలంలోని శ్రీశైలం 2వ పోలింగ్ కేంద్రంలో అత్యల్పంగా కేవలం 63.46 శాతం మాత్రమే ఓటింగ్‌లో పాల్గొన్నారు. ఈ కేంద్రంలో 717 మంది ఓటర్లు ఉండగా, ఇందులో పురుషులు 231, మహిళలు 224 మంది కలిపి 455 మంది మాత్రమే తమ ఓటు ఓటుహక్కును సద్వినియోగం చేసుకున్నారు.

90 శాతానికి పైగా పోలింగ్ నమోదు..

నియోజకవర్గంలో 90 నుంచి 94 శాతానికి పైగా ఓటింగ్ నమోదైన కేంద్రాలను పరిశీలిస్తే.. మహానంది మండలంలో సీతారామపురం, నందిపల్లె, మసీదుపురం, తమ్మడపల్లి, బొల్లవరం, ఆత్మకూరు మండలంలో కృష్ణాపురం, అమలాపురం, ఇందిరేశ్వరం, వడ్ల రామాపురం, శ్రీపతిరావుపేట, బాపునంతపురం, కొత్తరామాపురం, కృష్ణాపురం, ఎస్.ఎన్.తండా, సిద్ధపల్లి, పెద్ద అనంతపురం, నల్లకాల్వ, వెలుగోడు మండలంలో అద్దులాపురం, మోతూకూరు, బండిఆత్మకూరు మండలంలో బోదనం, పడమటూరు, పెద్దదేవలాపురం, జి.సి.పాలెం, సింగవరం, రామాపురం, బండిఆత్మకూరు, ఈర్నపాడు, కడమలకాలువ, సోమయాజులపల్లె, వెంగళరెడ్డిపేట, ఎ.కోడూరు గ్రామాల్లో 90 శాతానికి పైగా ఓటర్లు తమ ఓటుహక్కును సద్వినియోగం చేసుకున్నారు. ఆత్మకూరు పట్టణంలో 76 శాతం నుంచి 90 శాతం మాత్రమే ఓటర్లు తమ ఓటుహక్కును సద్వినియోగం చేసుకున్నారు. కాగా వెలుగోడు, సున్నిపెంట, ఆత్మకూరు పట్టణాల్లో కొంతమేర పోలింగ్ శాతం తగ్గింది.

బెట్టింగ్‌ల జోరు..

శ్రీశైలం నియోజకవర్గంలో అభ్యర్థుల గెలుపోటములపై జోరుగా బెట్టింగ్‌లు జరుగుతున్నాయి. వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి శిల్పా చక్రపాణిరెడ్డి గెలుపుపై రూ.50 వేల నుంచి రూ.20 లక్షల దాకా పలువురు పందేలకు సిద్ధమవుతున్నారు. వివిధ మండలాల్లోని ఆయా పార్టీల అభిమానులు పందెంకు సిద్ధమవుతుండగా, సమీపంలోని నందికొట్కూరు నియోజకవర్గానికి చెందిన వ్యక్తులు కూడా శ్రీశైలం నియోజకవర్గం గెలుపు, ఓటములపై పందేలు కాయడం విశేషం. మరో 96 గంటల్లో ఓటింగ్ ప్రక్రియ ప్రారంభం కానుండడంతో పందెం రాయుళ్లు జోరుగా పందేలు కాస్తున్నారు. డబ్బే ప్రధానం కాకుండా.. పార్టీపై అభిమానంతో తమ అభ్యర్థే విజయం సాధిస్తాడంటూ ధీమాగా బెట్టింగ్‌లకు పాల్పడుతున్నారు. ప్రధానంగా ఆత్మకూరు, బండిఆత్మకూరు, వెలుగోడు, మహానంది మండలాల్లో అభిమానులు ఎక్కువగా పందెలు కాస్తున్నారు.

23 రౌండ్లలో శ్రీశైలం నియోజకవర్గం కౌంటింగ్

ఆత్మకూరు: శ్రీశైలం నియోజకవర్గంలో జరిగిన అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా జూన్ 4వ తేదీన 23 రౌండ్లలో ఓట్ల లెక్కింపున నిర్వహిస్తున్నట్లు శ్రీశైలం నియోజకవర్గ ఆర్వో సుధారాణి తెలిపారు. గురువారం ఆమె మాట్లాడుతూ శ్రీశైలం నియోజకవర్గంలో 226 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని, ఇందుకు అనుగుణంగా ఒక రౌండ్‌కు 10 టేబుళ్లను ఏర్పాటు చేశామని, మొత్తం 23 రౌండ్లు ఉంటాయన్నారు. ప్రతి కౌంటర్ వద్ద ఇద్దరు సూపర్‌వైజర్లు, ఒక మైక్రో అబ్జర్వర్, ఒక అసిస్టెంట్ ఉంటారని చెప్పారు. కౌంటింగ్ కేంద్రంలో ఓట్ల పోస్టల్ బ్యాలెట్‌ను కూడా లెక్కించడం జరుగుతుందన్నారు. ఇందుకు నాలుగు టేబుళ్లను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. నంద్యాల పట్టణంలోని ఆర్‌జీఎం కళాశాలలో ఓట్ల లెక్కింపుకు సంబంధించిన ఏర్పాట్లను పూర్తి చేసినట్లు చెప్పారు.

పైపులైను లీకేజీలకు మరమ్మతులు

మహానంది: బండిఆత్మకూరు మండలం ఏ.కోడూరు గ్రామంలో పైపులైన్ లీకేజీలకు మరమ్మతులు చేపడుతున్నట్లు సర్పంచ్ మన్నె జ్ఞానాభరణం, కార్యదర్శి సుబ్బారావు తెలిపారు. గురువారం మెయిన్‌రోడ్డుతో పాటు గ్రామంలో పలు చోట్ల లీకయిన పైపులకు మరమ్మతులు చేశారు. వారు మాట్లాడుతూ గ్రామంలో పారిశుధ్య పనులకు ప్రాధాన్యత ఇస్తున్నామని, అలాగే మంచినీటి సమస్యలు లేకుండా చూస్తున్నట్లు చెప్పారు.

రైతుల అభివృద్ధికి సహకరించాలి

మహానంది: రైతుల అభివృద్ధికి ఉద్యాన విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులు సహకారమందించాలని మహానంది పరిశోధనా స్థానం సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ ఠాగూర్ నాయక్ అన్నారు. గురవారం గోపవరం గ్రామంలో రైతు సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ సుదర్శనం, ఉద్యాన కళాశాల ఏడీ వీఎస్‌కే రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

లక్ష్యాలను సకాలంలో పూర్తి చేయాలి



నెహ్రూనగర్ పశుగణాభివృద్ధి ఉపకేంద్రంలో రికార్డులు తనిఖీ చేస్తున్న ఏడీఏ రామాంజనేయ నాయక్

పగిడ్యాల: రైతు భరోసా కేంద్రాల పరిధిలో పశుసంవర్ధక శాఖ, ఉప కేంద్రాలకు నిర్దేశించిన లక్ష్యాలను సకాలంలో పూర్తి చేయాలని జూపాడుబంగ్లా పశుసంవర్ధక శాఖ ప్రాంతీయ సహాయ సంచాలకులు రామాంజనేయ నాయక్ ఆదేశించారు. గురువారం మండలంలోని నెహ్రూనగర్ గ్రామంలో చేపట్టిన టీకాల కార్యక్రమాన్ని ఆయన పర్యవేక్షించారు. ఆయన మాట్లాడుతూ వర్షాకాలంలో పశువుల్లో వ్యాపించే గొంతువాపు(గురక), జబ్బవాపు, చిటుకు వ్యాధి నివారణకు అన్ని గ్రామాల్లోని పశువులకు టీకాలు వేయాలన్నారు. భారత్ పశుధన్ యాప్‌లో కృత్రిమ గర్భధారణ ఇంజక్షన్లు, చూడి నిర్ధారణ, దూడల పుట్టిన వివరాలు, ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని ఆదేశించారు. అనంతరం పగిడ్యాల, పడమర ప్రాతకోట, ముచ్చుమర్రి పశువైద్యశాలలు, ఆర్‌బీకేలను తనిఖీ చేశారు. కార్యక్రమంలో డాక్టర్ రాగసంధ్య, వీఎల్‌ఓ శ్రీనివాసులు, వీఏ వీరేష్, ఏహెచ్ఏ చరిత తదితరులు పాల్గొన్నారు.

భవిత కేంద్రం సేవలను వినియోగించుకోవాలి



పిల్లల తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్న ఐఈఆర్‌టీ రామకృష్ణయ్య

పగిడ్యాల: ఆటపాటలతో కూడిన విద్యను అందించడంతో పాటు ఫిజియోథెరపీ శిక్షణ అందించే భవిత కేంద్రం సేవలను విభిన్న ప్రతిభావంతుల పిల్లల తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలని ఐఈఆర్‌టీ రామకృష్ణయ్య కోరారు. సీడబ్ల్యూఎస్ఎన్ ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్ కార్యక్రమంలో భాగంగా గురువారం స్థానిక కుంటవీధిలో విభిన్న ప్రతిభావంతుల పిల్లల తల్లిదండ్రులను కలిసి భవిత కేంద్రం విశిష్టతను తెలియజేశారు. మూగ, చెవిటి, బుద్ధి మాంద్యం, శారీరక వైకల్యం పిల్లలకు ప్రత్యేక శిక్షణ ఇవ్వడంతో పాటు వారికి స్పీచ్ థెరపీ, వినికిడి యంత్రం, యాక్టివిటీస్ ద్వారా శిక్షణ ఇప్పించడం జరుగుతోందని స్పష్టం చేశారు. జూన్ 8వ తేదీ వరకు సీడబ్ల్యూఎస్ఎన్ నమోదు కార్యక్రమం కొనసాగుతుందని అంగవైకల్యం కలిగిన పిల్లల పేర్లను భవిత కేంద్రంలో నమోదు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఐఈఆర్‌టీ అరుణకుమారి తదితరులు ఉన్నారు.

ముగిసిన ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు

నందికొట్కూరు: ఇంటర్మీడియెట్ సప్లిమెంటరీ పరీక్షలు గురువారం ప్రశాంతంగా ముగిశాయి. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చివరి రోజున మొదటి సంవత్సరం పరీక్షలకు 242 మంది విద్యార్థులకు గాను 228 మంది, సెకండ్ ఇయర్ పరీక్షలకు 143 మంది 129 విద్యార్థులు హాజరైనట్లు కళాశాల ప్రిన్సిపల్ షేక్షావలి తెలిపారు. చివరి రోజు ఇంటర్మీడియెట్ సప్లిమెంటరీ పరీక్షలు విద్యార్థులు ప్రశాంతంగా రాసినట్లు చెప్పారు.


నలుగురు గైర్హాజరు

మిడుతూరు: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గురువారం ప్రథమ సంవత్సరం కెమిస్ట్రీ పరీక్షకు 18 మంది విద్యార్థులకు గాను ముగ్గురు గైర్హాజరు అయ్యారని, ద్వితీయ సంవత్సరం కెమిస్ట్రీ పరీక్షకు 8 మంది విద్యార్థులకు గాను ఒకరు గైర్హాజరు అయ్యారని పరీక్షల నిర్వహణ అధికారి ప్రభాకర్ తెలిపారు. అలాగే స్థానిక ఆదర్శపాఠశాలలో నిర్వహించిన 10వ తరగతి పరీక్షలు ప్రశాంతంగా జరుగుతున్నాయని పరీక్షల నిర్వహణాధికారి సాయి తిమ్మయ్య, డిపార్ట్‌మెంటల్ అధికారి మహేష్ తెలిపారు. గురువారం నిర్వహించిన జీవశాస్త్రం తెలుగు మీడియంలో 157 మంది విద్యార్థులకు గాను 91 మంది హాజరయ్యారని, ఆంగ్ల మాధ్యమంలో 43 మందికి 28 మంది, ఉర్దూ మీడియంలో ఏడుగురికి గాను ఏడుగురు గైర్హాజరు అయ్యారని తెలిపారు.

జూపాడుబంగ్లాలో..

జూపాడుబంగ్లా: స్థానిక మోడల్ స్కూల్ పరీక్ష కేంద్రంలో ఉదయం ఇంటర్ ఫస్టియర్ కామర్స్, కెమిస్ట్రీ పరీక్షలు జరగగా 17 మంది విద్యార్థులకు 17మంది హాజరైనట్లు పరీక్షా కేంద్రం చీఫ్ రమేష్ తెలిపారు. మధ్యాహ్నం సెకండ్ ఇయర్ విద్యార్థులకు కెమిస్ట్రీ, కామర్స్ పరీక్షలు జరగగా ఐదు మంది విద్యార్థులకు గాను ఐదుగురు హాజరయ్యారన్నారు.

కొలనుభారతి అమ్మవారికి ప్రత్యేక పూజలు



సాముహిక అక్షరాభ్యాసాలు నిర్వహిస్తున్న దృశ్యం

కొత్తపల్లి: మండలంలోని శివపురం గ్రామ శివారుల్లోని నల్లమల అటవీ ప్రాంతంలో వెలసిన కొలనుభారతి దేవి ఆలయంలో సరస్వతి దేవి అమ్మవారికి భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. గురువారం చైత్రమాసం శుక్లపక్షము వసంతరుతువు వైశాఖమాసం సప్తమి రోజు కావడంతో సుదూర ప్రాంతాల నుంచి భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. సరస్వతి రూపంలో అమ్మవారు భక్తులకు దర్శనం ఇచ్చారు. అమ్మవారికి కుంకుమార్చన, పుష్పార్చన, మంగళహారతి వంటి విశేషపూజలు చేశారు. చిన్నారులకు భక్తిశ్రద్ధలతో, మంచి విద్యాబుద్ధులు ప్రాప్తించాలని ఆలయ పురోహితులు బీజాక్షరాలు దిద్దించి 12 మంది చిన్నారులకు కుటుంబ సమేతంగా అక్షరాభ్యాసకార్యక్రమాలు నిర్వహించారు.

శుభ్రమైన పౌష్టికాహారం అందించాలి



వంటల పోటీలలో విజేతలకు బహుమతి అందజేస్తున్న దృశ్యం

కొత్తపల్లి: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మధ్యాహ్నం సమయంలో శుభ్రతతోకూడిన పౌష్టికాహారం అందించాలని మాస్టర్ ట్రైనర్ రాజేశ్వరిదేవి సూచించారు. గురువారం స్థానిక కస్తూర్బా గాంధీ పాఠశాలలో మధ్యాహ్న భోజన నిర్వాహకులకు ఒక్క రోజు శిక్షణ కార్యక్రమాన్ని ఎంఈఓ–2 ఇనాయతుల్లా ఆధ్వర్యంలో నిర్వహించారు. ముందుగా నిర్వాహకులు వంటలు చేస్తున్న తరుణంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, వంటగది పరిసరాల పరిశుభ్రత, పరిశుభ్రమైర ఆహారం, మంచి పౌష్టికాహారం ఎలా అందించాలో అవగాహన కల్పించారు. మండలంలోని 42 పాఠశాలల మధ్యాహ్న భోజన నిర్వాహకులకు వంటల పోటీలు నిర్వహించారు. మొదటి స్థానంలో జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల కొత్తపల్లి, రెండవ స్థానంలో జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల దుద్యాల, మూడవ స్థానంలో జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల ముసలిమడుగు చెందిన నిర్వాహకులు నిలిచారు. వారికి ఎంఈఓ–1 శ్రీరాములు, ఎంఈఓ–2 ఇనాయతుల్లా, మాస్టర్ ట్రైనర్ రాజేశ్వరిదేవి బహుమతులు అందజేశారు.

పోలీసుస్టేషన్‌లో సీసీ కెమెరాల ఏర్పాటు

జూపాడుబంగ్లా: సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు జూపాడుబంగ్లా పోలీసుస్టేషన్‌లో ఏపీ స్వాన్ ఆధ్వర్యంలో 10 సీసీ కెమెరాలను ఏర్పాటు చేసినట్లు ఎస్ఐ లక్ష్మీనారాయణ తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ స్టేషన్ పరిసరాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకున్నా స్టేషన్ ఆవరణ, స్టేషన్ గదుల్లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల్లో రికార్డు అవుతుందని చెప్పారు. అలాగే నందికొట్కూరు సర్కిల్ పోలీసు స్టేషన్ పరిధిలోని మిడుతూరు, ముచ్చుమర్రి, నందికొట్కూరు, జూపాడుబంగ్లా పోలీసుస్టేషన్‌లలో సీసీ కెమెరాలు అమర్చినట్లు తెలిపారు.

ప్రశాంతంగా పదో తరగతి పరీక్షలు

నందికొట్కూరు: పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షలు గురువారం ప్రశాంతంగా జరిగాయి. పట్టణంలో పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షల నిర్వహణ కోసం రెండు పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎంఈఓ ఫైజున్నీసా బేగం మాట్లాడుతూ సైన్స్ పరీక్షకు 529 మంది విద్యార్థులకు గాను 281 మంది విద్యార్థులు హాజరయ్యారన్నారు. జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో ఇంగ్లిషు పరీక్షకు 255 మంది విద్యార్థులకు గాను 136 మంది, గవర్నమెంట్ హైస్కూల్‌లో 274 మంది విద్యార్థులకు గాను 145 మంది పరీక్షలు రాసినట్లు చెప్పారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే సహించం

మహానంది: శాంతిభద్రతలకు విఘాతం కలిగించే పనులు చేస్తే ఎంతటివారైనా ఉపేక్షించేది లేదని మహానంది ఎస్ఐ నాగేంద్రప్రసాద్ హెచ్చరించారు. గాజులపల్లె సమీపంలోని బుచ్చమ్మతోపు గ్రామంలో గురువారం కార్డన్‌సెర్చ్ నిర్వహించారు. ఈ మేరకు ప్రతి ఇంటిలో సోదాలు నిర్వహించారు. అనంతరం ఎస్ఐ నాగేంద్రప్రసాద్ మాట్లాడుతూ గ్రామంలో ఎవరైనా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కేసులు నమోదు చేసి జైలుకు పంపిస్తామన్నారు.

మొక్కుబడిగా సర్వసభ్య సమావేశం

మిడుతూరు: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో గురువారం ఎంపీపీ మల్లు వెంకటేశ్వరమ్మ అధ్యక్షతన నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశం మొక్కుబడిగా సాగింది. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున మండల సర్వసభ్య సమావేశంలో సమస్యలను ప్రస్తావించకుండా సదాసీదాగా కానిచ్చేశారు. సమావేశంలో వివిధ శాఖల అధికారులు వారివారి పరిధిలో జరిగిన అభివృద్ధి కార్యక్రమాలు, ప్రజలు అందించిన సంక్షేమ పథకాలను తెలియజేశారు. గ్రామాలలో తీసుకోవాల్సిన చర్యలపై సమాలోచనలు చేశారు. కార్యక్రమంలో సహకార సొసైటీ చైర్మన్ నాగతులసి రెడ్డి, ఎంపీటీసీలు నాగేశ్వరరెడ్డి, హరిసర్వోత్తమ రెడ్డి, కో–ఆప్షన్‌మెంబర్ మౌలా, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ విశ్వనాథ్, విద్యుత్‌శాఖ ఏఈ క్రాంతికుమార్, ఈఓఆర్డీ పక్రుద్దీన్, ఏపీఓ జయంతి తదితరులు పాల్గొన్నారు.

మరోసారి వైఎస్ జగన్ సీఎం కావాలని పాదయాత్ర



పాదయాత్రగా శ్రీశైలం వస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

శ్రీశైలంటెంపుల్: మరోసారి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి కావాలని వైఎస్సార్‌సీపీ నాయకులు ప్రకాశం జిల్లా ఎర్రగొండపాలెం నియోజకవర్గం నుంచి పాదయాత్రగా శ్రీశైలం చేరుకున్నారు. గురువారం శ్రీశైలం చేరుకున్న పాదయాత్ర బృందానికి శ్రీశైలం మండల వైఎస్సార్‌సీపీ రాష్ట్ర మైనార్టీ కార్యదర్శి ఎంఏ.రజాక్, నాయకులు ఘన స్వాగతం, మద్దతు తెలిపి పాదయాత్రలో పాల్గొన్నారు. జూన్ 4వ తేదీన జరుగనున్న ఎన్నికల ఫలితాల్లో వైఎస్సార్‌సీపీ విజయఢంఖా మోగించడం ఖాయమని నాయకులు ధీమా వ్యక్తం చేస్తున్నారు. గత రెండు రోజుల నుంచి ప్రకాశం జిల్లా ఎర్రగొండపాలెం నియోజకవర్గం పుల్లలచెరువు మండల వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా కన్వీనర్లు పాదయాత్ర చేసుకుంటూ శ్రీశైలం చేరుకున్నారు. అనంతరం వైఎస్ జగన్ మరోసారి సీఎం కావాలని, ఒంగోలు ఎంపీ అభ్యర్థి చెవిరెడ్డి భాస్కరరెడ్డి, ఎర్రగొండపాలెం ఎమ్మెల్యే అభ్యర్థి తాటిపర్తి చంద్రశేఖర్ అత్యధిక మెజార్టీతో గెలవాలని మల్లికార్జున స్వామివారికి, భ్రమరాంబాదేవికి ప్రత్యేక పూజలు నిర్వహించామని నాయకులు తెలిపారు.

నిబద్ధతతో పనిచేస్తేనే గుర్తింపు



పీఆర్ ఏఈ రామచంద్రయ్య దంపతులను సన్మానిస్తున్న అధికారులు

కొత్తపల్లి: నిబద్ధతతో పనిచేస్తేనే ప్రజల్లో, సమాజంలో గుర్తింపు లభిస్తుందని కర్నూలు పంచాయతీ రాజ్ సూపరింటెండెంట్ ఇంజినీరు కె.సుబ్రహ్మణ్యం, ఎంపీడీఓ జవహర్‌బాబు, జెడ్పీటీసీ సోమల సుధాకర్ రెడ్డిలు అన్నారు. గురువారం మండల కేంద్రంలో వెన్నెల గార్డెన్స్‌లో మండల పంచాయతీ రాజ్ శాఖ ఏఈ రామచంద్రయ్య పదవీ విరమణ సన్మాన కార్యక్రమం నిర్వహించారు. వారు మాట్లాడుతూ పీఆర్ ఏఈగా రామచంద్రయ్య మండలంలో సుమారు 12 సంవత్సరాలు ప్రజలకు సేవలందించారన్నారు. ఎంతో నిబద్ధత కలిగి విధులు నిర్వహించేవారన్నారు. అనంతరం ఏఈ దంపతులను అధికారులు, సిబ్బంది గజమాలతో, దుశ్శాలువలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పీఆర్ డీఈ ధనిబాబు, పంచాయతీ రాజ్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు కర్నూలు రామకృష్ణారెడ్డి, మద్దన్న, ఎంఈఓలు శ్రీరాములు, ఇనాయతుల్లా, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కె.సుధాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సకాలంలో విధులకు హాజరైన అధికారులు

సాక్షి ఎఫెక్ట్

జూపాడుబంగ్లా: తంగెడంచ సీడ్ ఫాం అధికారులు, సిబ్బంది గురువారం సకాలంలో విధులకు హాజరయ్యారు. కార్యాలయానికి సమయానికి హాజరుకావడం లేదని గురువారం 'సాక్షి' దినపత్రికలో 'ఎప్పుడొచ్చినా అడిగే వారెవరూ?' శీర్షికన ప్రచురితమైన కథనానికి ఫారం ఏడీఏ అరుణలత, సిబ్బంది స్పందించి సకాలంలో విధులకు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బుధవారం నాడు ఆఫీసు పనిపై నేషనల్‌హైవే అధికారులను కలవడానికి వెళ్లినట్లు తెలిపారు.

210 ఎకరాల్లో కంది సాగు

ఖరీఫ్ సీజన్‌కు గాను 210 ఎకరాల తంగడంచ ఫారం భూముల్లో ఎల్‌ఆర్‌జీ–105 కొత్తరకం కంది పంటను సాగు చేయనున్నట్లు ఏడీఏ తెలిపారు. ప్రస్తుతం ఫారంలో 210 ఎకరాల భూములు మాత్రమే సాగుకు అనుకూలంగా ఉండగా వాటిలో ఖరీఫ్ సీజన్‌కుగాను కందిసాగు చేయనున్నట్లు వెల్లడించారు. మరికొన్ని ఎకరాల్లో పంటలు సాగుచేసేందుకు వ్యవసాయశాఖ కమిషనర్‌కు ప్రతిపాదనలు పంపినట్లు తెలిపారు. కమిషనర్ కార్యాలయ అధికారులు ఉత్తర్వులు జారీ చేస్తే ఫారంలోని భూములను సాగుకు అనుకూలంగా మార్చి పంటలు సాగుచేస్తామన్నారు.

ఆలయ ప్రతిష్ఠకు భంగం కలిగిస్తే చర్యలు

మహానంది: ఆలయ ప్రతిష్ఠకు భంగం కలిగిస్తే చర్యలు తీసుకుంటామని ఈఓ చంద్రశేఖర్‌రెడ్డి హెచ్చరించారు. ఆలయ ప్రాంగణంలోని మండపాలు, కేశఖండనశాల ప్రాంగణాల్లో ఓ జంట (ఆలయంలో పనిచేసే ఏజెన్సీ ఉద్యోగులు) సన్నిహితంగా మెలగడం, ఈ విషయం సోషల్ మీడియాలో వైరల్ కావడంతో ఆలయ అధికారులు చర్యలకు రంగం సిద్ధం చేశారు. ఈఓ మాట్లాడుతూ సోషల్ మీడియాలో వచ్చిన విషయాలపై ఆరా తీస్తున్నామని, ఆలయ పరిధిలోని సీసీ కెమెరాలను క్షుణ్ణంగా పరిశీలిస్తున్నామని చెప్పారు. ఎవరైనా ఆలయ ప్రతిష్ఠకు భంగం కలిగించే పనులు చేసినట్లు ఆధారాలు లభిస్తే శాశ్వతంగా ఇంటికి పంపించేందుకు వెనుకాడబోమని అన్నారు.

సీఐటీయూ ఆవిర్భావ దినోత్సవం

ఆత్మకూరు/వెలుగోడు: సీఐటీయూ 54వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు గురువారం ఆత్మకూరు పట్టణంలో, వెలుగోడు గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. సంఘం జిల్లా అధ్యక్షుడు యేసురత్నం జెండావిష్కరణ చేశారు. కార్యక్రమంలో పట్టణ కార్యదర్శి రామ్‌నాయక్, జిల్లా కార్యదర్శి రామాంజనేయులు, నాయకులు మల్లయ్య, పుల్లయ్య, ఆనంద్‌బాబు, శ్రీను, నాగమోహన్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

రచ్చబండల వద్ద రాజకీయ విశ్లేషణలు

- ఎన్నికల ఫలితాలపై గ్రామాల్లో ఉత్కంఠ
- రోజులు దగ్గర పడేకొద్ది వాడీవేడి చర్చలు
- సాధారణ ఓటర్ల నోట వైఎస్సార్‌సీపీదే విజయం అనే మాట
- ఫలితాల వెల్లడికి మరో నాలుగు రోజులే



నందికొట్కూరు: సార్వత్రిక ఎన్నికల ఫలితాలపై గ్రామీణ ప్రాంత ప్రజల్లో ఉత్కంఠ నెలకొంది. మీ గ్రామంలో ఓట్లెలా పడ్డాయ్..ఏ పార్టీకి మెజార్టీ వస్తుందంటావ్..అక్కడ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి బాగుందంటగా, అయా గ్రామాల్లో కూడా ఆ పార్టీకే వన్‌సైడ్ చేశారంటా.. అంటూ నందికొట్కూరు నియోజకవర్గంలోని గ్రామాల్లో ఎక్కడ చూసినా సాధారణ ఓటర్ల నుంచి ఈ మాటలు వినిపిస్తున్నాయి. సమయం దగ్గర పడేకొద్ది నలుగురు, ఐదుగురు కలిస్తే చాలు..రాజకీయాల గురించి వాడీవేడిగా చర్చలు. ఏం మాట్లాడటం మొదలు పెట్టినా చివరకు ఆ చర్చ ఎన్నికలతో ముడిపడి ఉంటుంది. శుభకార్యాలకు, బంధువుల ఇళ్లకు వెళ్లినా ఎన్నికల గురించే చర్చించుకుంటున్నారు. ఈ చర్చలు గ్రామాల్లోనే ఎక్కువగా జరుగుతున్నాయి. కొన్నిచోట్ల అయితే ఈ చర్చలు సవాళ్లు..ప్రతి సవాళ్లకు దారితీసే పరిస్థితులు కనిపిస్తున్నాయి.

2014 నుంచి వైఎస్సార్‌సీపీ అడ్డాగా నందికొట్కూరు

ఈ నెల 13వ తేదీన జరిగిన సార్వత్రిక ఎన్నికలు జరగ్గా.. ఫలితాలు రావడానికి నాలుగు రోజులే అంటే 96 గంటలే ఉండడంతో గ్రామాల్లో ఎన్నికల ఫలితాలపై ఉత్కంఠ కనిపిస్తుంది. నందికొట్కూరు నియోజకవర్గంలో 2,18,047 ఓటర్లు ఉన్నారు. ఈ సార్వత్రిక ఎన్నికల్లో 1,84,888 ఓట్లు పోలయ్యాయి. వీరిలో పురుషులు 1,06,689, మహిళలు 1,11,340, ఇతరులు 12 మంది ఓటర్లు ఉన్నారు. నియోజకవర్గంలో ప్రధానంగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ, టీడీపీ కూటమి మధ్యే పోటీ నెలకొంది. 2019లో జనసేన పార్టీ నేరుగా బరిలో దిగడంతో వైఎస్సార్‌సీపీ, టీడీపీ, జనసేన పార్టీ మధ్య త్రిముఖ పోటీ నడిచింది. 1994 నుంచి 2004 వరకు టీడీపీ కంచుకోటగా ఉన్న నియోజకవర్గంలో 2004 నుంచి 2009 వరకు కాంగ్రెస్ పార్టీ జెండా పాతింది. ఆ తరువాత 2014 నుంచి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి అడ్డాగా నిలిచింది. 2024 సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అధినేత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ధాటికి తట్టుకోలేక టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి కట్టి బరిలోకి దిగారు. కాగా ఈ ఎన్నికల్లో నియోజకవర్గంలో టీడీపీకి పట్టున్న పలు గ్రామాలు, వార్డుల్లో సైతం వైఎస్సార్‌సీపీ ప్రభంజనం సృష్టించనుందని ప్రజలు చర్చించుకుంటున్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ఈ ఎన్నికల్లో నియోజకవర్గంలో 1,006 ఓట్లకు పైగా అధికంగా మహిళలు ఓటు వేశారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేసిన సంక్షేమ పథకాలు ఈ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ గెలుపుపై ప్రభావం చూపనున్నాయని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు.